మల్లాప్రగడ
రామారావు

"దేశం ఏమై పోతున్నది?"

సుబ్బయ్య నెత్తి మాడిపోతున్నది. పైన సూర్యుడు మండిపోతున్నాడు.

'పట్టుమని పది గంటలైనా కాలేదు. పాడు ముండా ఎండ మట్టుకు ప్రచండంగా ఉంది' అనుకున్నాడు సుబ్బయ్య.

'పంటలు పండీ కరువులాగ, గొడుగు గుండీ తెరవడానికి వీల్లేదు' అని తన వెనకనున్న వారిని చూసి విసుక్కున్నాడు సుబ్బయ్య.

'ఇది మన మందరం ఆలోచించవలసిన విషయం.

'నయం— వాళ్లతో వాదించైనా సరే ఆ బస్సు ఎక్కాను. లేకుంటే మీటింగ్‌కి లేటైపోయి ఉందును' అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు సుబ్బయ్య.

'చారల బుష్‌కోటూ, సోడా బుడ్డీ కళ్లద్దాలూ వాడూను. వాడు బస్సెక్కగానే సరిపోయిందనుకున్నాడు కాబోలు! ఆ పంగనామాలవాడు, వాడికి తోడు. చద్దన్నం తిన్నమ్మ మొగుడి ఆకలి ఎరగదట! శుభ్రంగా సీట్లో కూర్చుని, సిగరెట్టు కాల్చుకుంటున్నవాడికి, గంటల తరబడి బస్సు కోసం నిలుచుండి, ఏ వెధవా బస్సాపక పోగా ప్రయాణీకులు పడే అగచాట్లెలా తెలుస్తాయి? ఎర్రని ఎండలో జోళ్లు విప్పించి నడిపించాలి వెళ్లని. అప్పుడుగాని తెలిసి రాదు' అనుకుంటూ మనసులోనే అక్కసు వెళ్లగక్కుకున్నాడు సుబ్బయ్య.

అప్పటికి మూడు బస్సులు ఆగకుండానే పోయాయి. బస్సు కోసం నిలుచుని నిలుచుని కాళ్లు పీకెడుతున్నాయి. మీటింగ్‌కి వేళై పోతుందని తొందరో మూల. ఎలాగైతేనేం వచ్చిందో బస్సు. వచ్చిన బస్సు 'స్టాపు'కి దాదాపు ఇరవై గజాల దూరంలో ఆగింది. 'హో'మని అక్కడికే పరుగెత్తారు జనం.

"ఆగండి, మాస్టారూ!" అన్నాడు బస్సు క్లీనరు, సుబ్బయ్యని చెయ్యి అడ్డం పెట్టి ఫుట్‌బోర్డుమీదే ఆపి. 'ఏం?' అన్నట్టు చూశాడు సుబ్బయ్య. పార్లమెంట్ ఎలక్షన్స్‌కి పార్టీ టిక్కెట్లిచ్చేటట్లు— "మూడు టిక్కెట్లే ఖాళీ. దిగండి" అన్నాడు క్లీనరు.

సుబ్బయ్యని తోసుకుని ముందెక్కిన మూడోవాడు తన అదృష్టానికి గర్విస్తున్నట్టు, సుబ్బయ్య దురదృష్టానికి సంతోషిస్తున్నట్టు చిన్నగా ఓ నవ్వు నవ్వాడు, సుబ్బయ్యని చూసి.

సుబ్బయ్యకి ఎప్పుడూ రానంత కోపం వచ్చింది. కోపంతోబాటు ధైర్యమూ వచ్చింది. "నేను దిగను" అన్నాడు ఖండితంగా.

"దిగకపోతే బండి కదలదు. ఆపవయ్యా ఇంజను" అని అరిచాడు క్లీనరు. ఇంజను ఆగింది. సుబ్బయ్య వెనక బస్సు కమ్మీలు పట్టుకు వేలాడుతున్న మరో ముగ్గురు, నలుగురుకూడా, "ఎక్కించవయ్యా. నీ సొమ్మేం పోయింది! గంటై బస్సు కోసం చూసి వస్తున్నాం" అన్నారు.

"ఏమిటండీ అలా మాట్లాడుతారు? బస్సన్న తరవాత కెపాసిటీ ఉండదా?" అని వెనక సీట్లో కూర్చున్న చారల బుష్‌కోటువాడు సిగరెట్టు పొగ వదులుతూ అన్నాడు.

"బందులదొడ్లో పందుల్ని కుక్కినట్టు పాసెంజర్లని కుక్కిస్తే ఊపిరాడద్దూ" అని వత్తాసు పలికాడు పక్కనే కూర్చున్న పంగనామాలు.

సుబ్బయ్యకి సాటివాడి బాధ అర్థం చేసుకోని ఆ ఇద్దరిమీదా బస్సు వాళ్ల మీదకంటే ఎక్కువ కోపం వచ్చింది.

కండక్టరుకూడా అక్కడికొచ్చి, "గొడవెందుకు, బాబూ? దిగిపోండి. వెనక వస్తున్న బస్సులో వద్దురుగాని. ఓవర్ లోడై కేసు పెడితే మధ్యన మేం ఏడవాలి" అని సముదాయించబోయాడు.

సావిత్రికి యముడు లాగ సుబ్బయ్యకి కండక్టరు చిక్కాడు.

"బస్సు కెపాసిటీ ఎంత? నువ్వెందరిని ఎక్కించావు" అని ఎదురు ప్రశ్న వేశాడు.

అప్పటికే బస్సు జనంతో మిశ్రమ మంత్రివర్గంలా కిటకిటలాడుతున్నది. సుబ్బయ్య వెనకాల ఉన్న వాళ్లకూడా "నువ్వు కెపాసిటీ మించి ఎక్కించిన వాళ్లందరినీ దింపెయ్. మేమూ దిగిపోతాం. లేదా మమ్మల్నికూడా తీసుకు వెళ్లు" అని దొంగ దగ్గర వాటా పుచ్చుకునే పోలీసులాగ న్యాయంగా పట్టు పట్టారు.

యుద్ధకారణాలు గుర్తించకుండా శాంతి సాధించాలనుకునే కొన్ని అగ్ర రాజ్యాల్లా, బస్సులో కూర్చున్న కొందరు పెద్ద మనుష్యులు— "గొడవ దేనికి? పోనీవయ్యా బస్సుని. ఇప్పటికే ఆలస్యమైంది" అని కండక్టరుకి సలహా ఇచ్చారు.



భవన సౌందర్యం

ఫొటో — రఘురాం (మధ్యప్రదేశ్)

**అధికారంలో ఉన్నవాడు ఏం వాగినా జనం చచ్చినట్లు విని తీరాలి. మంత్రుల ప్రసంగాలలో పసలేకపోయినా, వారి వాగ్దానాలు నేతి బీరకాయలైనా జనం వింటూ సకి. చప్పట్లు చరచడానికి అలవాటు పడ్డారు. వారిని వీరు, వీరిని వారు మోసం చేస్తున్నట్లు ఇరు పక్షాలకీ తెలుసు**

కండక్టరు "రైట్!" అని కేక వేసి, "ఫుట్‌బోర్డుమీద మానేసి లోపల సర్దుకోండి" అన్నాడు సుబ్బయ్యాదుల నుద్దేశించి.

సుబ్బయ్య నవ్వాడు.

సుబ్బయ్యని తోసుకుని ముందెక్కిన మూడో వాడు నవ్వలేదు.

చారల బుష్‌కోటువాడు సిగరెట్టు పీలుస్తూ, సోడాబుడ్డీ కళ్లద్దాల లోంచి బయటికి, పాడుం దట్టించి పంగనామాలవాడు పేపరులోకి చూడసాగారు.

బస్సు త్రైపాక్షిక సంఘంలా అందరినీ తనలో ఇముడ్చుకుని బయలుదేరింది.

• • •

"ఎవరు అధికారంలో ఉన్నారు అన్నది ముఖ్యం కాదు 'అధికారంలో ఉన్నవారు ఎలా ప్రవర్తిస్తున్నారు' అన్నది ముఖ్యం. అధికారంలో మేమూ ఉన్నాం. అప్పుడు ఈ ఊర్లో మీటింగ్‌కే ఈ గ్రౌండే క్రిక్కిరిసి పోయింది. ఈ వేదిక లైసెన్సుల గురించి, రికమెండేషన్ల గురించి, ఇంకా ఏవేవో లాభాలాశించి వచ్చిన పెద్దలతో నిండిపోయింది. దండల బరువుతో నా మెడ వంగిపోయింది. అయితే, తెప్పలుగ చెరువు నిండగా వచ్చిన కప్పలవి.

ఈ వేళ, ఇక్కడ చేరిన మీ రంతా స్వంత శ్రేయస్సు నాశించికాక, ఒక ఆశయాన్ని, ఒక ఆదర్శాన్ని నిలబెట్టేందుకు వచ్చినవారని నాకు తెలుసు. ఈ బూటకపు ప్రభుత్వపు నాటకాన్ని కట్టించి, దేశంలో ప్రజాస్వామ్యాన్ని సుస్థిరం చేసేందుకు మీ రంతా మాతో సహకరిం



చాలి. సహకరించగలరని ఆశిస్తున్నాను. సహకరించమని విజ్ఞప్తి చేస్తున్నాను.''

అందరితోబాటు సుబ్బయ్యా చప్పట్లు చరిచాడు.

మైక్ ముందు కంఠం మళ్ళీ మోగింది.

''రవి గాంచనిచో కవి గాంచును అన్నారు. ఇప్పుడు మన సమాజ మున్న దుస్థితీ, నైతిక విలువా రాహిత్యమూ, మానవుడిని మానవుడే దోపిడీ చేసే విధానమూ పట్ల తీవ్ర విమర్శతో గూడిన తన కవిత 'చరిత్ర నిన్ను క్షమించదు' చదువుతారు ప్రజాకవి రుద్రశ్రీ.''

సుబ్బయ్య ఆ కవితను వీలైనంత శ్రద్ధగా వింటున్నాడు.

వక్త తల ఊపుతూ తన ఆనందాన్ని తెలియజేస్తున్నాడు.

గేయంలోని ఆవేశానికి వేడెక్కి కర్మ సాక్షి సూర్యుడు మరింత మండిపోతున్నాడు.

• • •

''దేశం ముందుకు పోతున్నది.''

సుబ్బయ్య నెత్తి మాడిపోతున్నది.

పైన సూర్యుడు మండిపోతున్నాడు.

'దేశంలో దరిద్రం లాగ ఈ ఏడాది వేసవికాలం అంతం కాదు కాబోలు' అనుకున్నాడు సుబ్బయ్య.

'ఏం ఊరో! ఉదయం మీటింగులు పెట్టి ఆఫీసుకి ఆలస్యంగా రావడానికి పెర్మిషన్నిచ్చే బదులు' చక్కగా సాయంకాలం సభలు జరుపుకోరాదా?' అని వేదిక వేపు చూస్తూ విసుక్కున్నాడు సుబ్బయ్య.

'ఇది మన మెవ్వరం కాదనలేని విషయం.

'కాదూ కూడదంటే పోలీస్‌స్టేషన్‌కి అప్పచెప్పి ఉందును' అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు సుబ్బయ్య.

''మంత్రిగారి మీటింగు, బాబూ! అందరికీ తొందరే. ఎవర్ని వదిలీమంటారు'' అంటాడా కండక్టరు!

'మంత్రిగారి మీటింగైతే బస్సుల్నిండా మనుష్యుల్ని కుక్కేసి, ఒకరి మీదొకర్ని ఎక్కించి ఊపిరి తిరక్కుండా చంపేయాలి గావాల్ను? అంత మీటింగు మీద శ్రద్ధయితే పెందలకడే బయలుదేరద్దా? అవ్వా, బువ్వా కావాలంటే ఎలా కుదురుతుంది' అనుకొంటూ మనసులోనే అక్కసు వెళ్ళగక్కుకున్నాడు సుబ్బయ్య.

ఉదయం లేచి వేగంగా తయారై బస్సుస్టాపు చేరుకుని, తను వెళ్ళవలసిన వేపునుంచి వస్తున్న బస్సెక్కి, ఆ బస్సు 'టెర్మినల్ పాయింట్' వరకూ టిక్కెట్టు తీసుకుని తిరిగి ఆ బస్సులోనే మీటింగు స్థలానికి బయలుదేరాడు సుబ్బయ్య. ముప్ఫయిరెండు పైస లెక్కువైనా, బస్సులో హాయిగా కూర్చునేందుకు స్థలం దొరికింది.

బస్సు సుబ్బయ్య ఎక్కిన స్టాపుకి దాదాపు ఇరవై గజాల దూరంలో ఆగింది. ఎక్కడలేని జనమూ ఒకర్ని తోసుకుని ఒక రెక్కేసి ఒకటే తొక్కిడి.

చౌకడిపో క్యూలో కుమ్ములాడుకుంటున్న కూలీ, నాలీ చేసుకునే జనాన్ని గల్లాపెట్టె ముందు కూర్చున్న షాహుకారు చూస్తున్నంత ధీమాగా వాళ్ళని చూస్తున్నాడు సుబ్బయ్య.

సుబ్బయ్య కాలోకడు మట్టేశాడు. అప్పుడు మాత్రం చిరాకు ముంచుకొచ్చి కండక్టర్ని అడిగాడు, కెపాసిటీ గురించి. కండక్టరు సమాధానం పూర్తయ్యేంతలో

ఫుట్‌బోర్డు మీదున్న తాతొకడు అందుకున్నాడు. "నువ్వెక్కేసి, నిమ్మళంగా కూకొని, అంతా సరిపోవాదనుకుంటన్నావు గావల్ను" అంటూ నిలదీశాడు.

ఒంటిని చొక్కా అయినా లేదు. మోకాలు దిగని పంచ మొలకి చుట్టుకున్న ముసలివెధవ వాడా మాటంటాడా? వీడి డబ్బు లిచ్చి బస్సు ఎక్కించాడా? వీ డబ్బ డబ్బులిచ్చా?

"ఏమిటండీ అందరూ ముందో వెనకో దిగిపోవలసినవాళ్లమే కదా! మనలో మనం సర్దుకు పోకపోతే ఎలా?"

వాడికి వీడు సాయం. లొడితెడు లేదు మనిషి. వాడికన్నా వాడి చెంపలు పొడుగు. వాడూ సలహా లివ్వడమే. ఈ వేళో, రేపో అంతా చచ్చేవాళ్లమే కదా— బస్సు కింద బుర్ర పెట్టి లేక పోయాడూ?

సుబ్బయ్య పక్కన కూర్చున్న ప్రయాణికుడుకూడా ఊరుకోలేదు. "మంత్రిగారి మీటింగైతే స్పెషల్ బస్సులు నడపలేకపోయారా? ఇంకెంత మంది నెక్కిస్తావు?" అని కండక్టర్ని గదమాయించాడు. ముగ్గురు నలుగు రందుకు వత్తాసు పలికారు.

"ఇలా అయితే పోలీస్ స్టేషన్లో కంప్లెయింటు ఇయ్యవలసి వస్తుంది" అన్నాడు సుబ్బయ్య. ఫుట్‌బోర్డు మీద నిలుచున్న వాళ్ల తప్ప, ఇంకా బస్సెక్కబోతున్న వారిని దింపేసి — కండక్టరు "రైట్" అన్నాడు.

ముసలివాడు సుబ్బయ్య వేపు కొరకొరా చూశాడు.

పొడుగు చెంపలవాడు ముసిముసిగా నవ్వాడు.

సుబ్బయ్య బస్సు దొరకని వారివేపు నిర్లిప్తంగా చూశాడు.

భారతదేశంలాగ అన్ని వైరుధ్యాలనూ తనలో ఇముడ్చుకొని బస్సు బయలు దేరింది.

"ఒక అద్భుతమైన మార్పు జరిగింది స్వాతంత్ర్యానంతరం భారత దేశంలో. అయితే విశాలమైన ఈ దేశంలో, శతాబ్దాల తరబడి పేరుకున్న దారిద్ర్యాన్నీ, అవమానతలనూ ఒక్క రోజులో తీసి వేయడం సాధ్యం కాదు. ఒక బృహత్తర ప్రయత్నం జరుగుతున్నది. ప్రగతి కోసం కృషి చేస్తున్నాం.

"మా మంత్రివర్గం, పార్టీ అభివృద్ధిని ఆటంకపరిచే అన్ని శక్తులనూ ఎదుర్కొంటాయి. ఎవరు అడ్డు పడినా ఈ సామ్యవాద వ్యవస్థాపన ఆగదు. ప్రజా బలం అండగా గల ఈ ప్రభుత్వం తన పవిత్ర కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. ఆ యత్నంలో అందరి తోడ్పాటు కావాలి. మీ రందరూ తోడ్పడగలరని ఆశిస్తున్నాను. తోడ్పడమని విజ్ఞప్తి చేస్తున్నాను."

మనసులో—'ప్రతిపక్షం నుంచి చీలి, అధికారవర్గంలో చేరి ఈయన మంత్రి కావడమే కాబోలు అద్భుతమైన మార్పు' అనుకున్నా, అందరితో బాటు సుబ్బయ్యా చప్పట్లు చరిచాడు.

మైక్ ముందు కంఠం మళ్లీ మోగింది.

"కవిపించక వినిపించేవాడు కవి అన్నారు. ఇప్పుడు తను కవిస్తూనే మనకు దేశాభ్యుదయాన్ని, ప్రణాళికా ప్రగతిని, నవ సమాజ స్థాపనా కార్యక్రమాన్ని శ్లాఘించే తన కవిత 'ఉజ్జ్వల భారతం' వినిపిస్తారు నవ యువకవి రుద్రశ్రీ!"

సుబ్బయ్య ఆ కవితను వీలైనంత శ్రద్ధగా వింటున్నాడు.

వక్త తల ఊపుతూ తన సమ్మతి తెలియజేస్తున్నాడు.

తను చూడలేని ఆనంద సౌభాగ్యాలను కాంచిన కవిగారి ముఖ కమలాన్ని చూడ డానికి మనసు రాక కర్మసాక్షి సూర్యుడు మబ్బుల్లో ముఖం దాచుకున్నాడు. ★




## ఇంగ్లీష్ ఛానల్ దాటి...

ఇంగ్లీష్ ఛానల్‌లో ఆ ఒడ్డుకు వెళ్ళి ఈ ఒడ్డుదాకా తిరిగి ఈది వచ్చిన తొలి మహిళ ఫ్లోరెన్స్ చాడ్విక్ అనే అమెరికన్.

మొదట 1950 ఆగస్టులో ఈమె 13 గంటలా 23 నిమిషాలలో ఫ్రాన్సు నుంచి ఇంగ్లాండుకు ఛానల్‌లో ఈది రెండో శ్రేణికి వచ్చింది. మరి 1951 సెప్టెంబరు 11 న ఇంగ్లాండు నుంచి ఫ్రాన్సుకు ఈది ఘనవిజయం సాధించింది.

మూడు మైళ్ళు ఈదగానే మోటారు బోటు పొగతో జబ్బు పడింది. అలాగే నెట్టుకొని వెళ్ళింది. ఛానల్ నడుమ జెల్లీ ఫిష్ కఱిచింది. ప్రక్కన బోటులో రక్షగా వెడుతున్న ఆమె తండ్రి ఇక మానెయ్యమన్నా వినలేదు.

ఫ్రాన్సు చేరుతుండగా మంచు పొగ కమ్మి అలాగే విడిపోయింది. తుదకు 16 గంటలా 19 నిమిషాలలో ఆవలి గట్టు చేరింది.